రక్షణ కల్పించాలి



కష్టపడి కాదు..ఇష్టపడి సేవాదృక్పథంతో డాక్టర్ వృత్తిని ఎంచుకున్నాం. ఆస్పత్రికి వచ్చే వాళ్లను కుటుంబసభ్యులుగానే భావిస్తూ చికిత్స ఇస్తుంటాం. అలాంటి మాపై కత్తి కడుతున్నారు. ఇది ముమ్మాటికీ దారుణం. ఎట్టి పరిస్థితుల్లోను దీనిని మేము జీర్ణించుకోలేం. కోల్‌కతా ఘటన మరెక్కడ జరగకూడదని దేవుని వేడుకుంటున్నా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాకు రక్షణ కల్పించాలి.

–సాయి అఖిల, జూనియర్ డాక్టర్, చిత్తూరు

భద్రత అవసరం



ముందు అయితే బిడ్డ జాగ్రత్తగా ఉంటుందిలే అనుకుని పెద్దగా పట్టించుకునే వాళ్లు కాదు. ఎందుకంటే వైద్య వృత్తి అలాంటిది. అయితే కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఘటనతో మా తల్లిదండ్రుల్లో భయం పట్టుకుంది. ఇప్పుడు డ్యూటీకి వెళ్లక ముందు, డ్యూటీకి వచ్చిన తర్వాత పదే పదే ఫోన్ చేస్తున్నారు. పనిచేసే చోట ప్రతిఒక్కరూ కోరుకునేది భద్రత. భద్రత పూర్తి స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నాం.

–పూజిత, జూనియర్ డాక్టర్, చిత్తూరు



కొత్త చట్టాలు తేవాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణంతో మహిళా డాక్టర్లలో ఆందోళన నెలకొంది. వైద్యం అందించే డాక్టర్‌కు ఈ పరిస్థితులు ఎదురు కావడం చాలా బాధాకరం. వైద్యుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఇండియాలో ఉన్న ప్రతి కళాశాలలోనూ రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేసే చోట ప్రత్యేక భద్రత కల్పించాలి.

–మనస్విని, జూనియర్ డాక్టర్, చిత్తూరు

క్లుప్తంగా

పీఎం సూర్యఘర్‌కు ఆదరణ

చిత్తూరు కార్పొరేషన్: పీఎం సూర్యఘర్‌కు ఆదరణ పెరుగుతోందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. బుధవారం ఈఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పథకం ఉద్దేశం, విధివిధానాలను తెలియజేశారు. దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాక వెండర్స్ ఇంటి పైకప్పుపై స్థలం పరిశీలిస్తారన్నారు. తర్వాత సౌరఫలకాలు ఏర్పాటు చేస్తారన్నారు. చివరిగా నెల తర్వాత సబ్సిడీ మొత్తం పడుతుందన్నారు. ఈఈలు మునిచంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి బుధవారం నంద్యాలకు చెందిన గూడా లక్ష్మి, ఈశ్వరమ్మ రూ.1,00,116 విరాళంగా ఆలయ ఈఓ కే.వాణికి అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి. సిబ్బంది పాల్గొన్నారు.

మొగిలీశ్వరునికి రూ 2.11లక్షల ఆదాయం

బంగారుపాళెం: స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామికి హుండీ కానుకల ద్వారా రూ.2,11,825 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఆలయ ఆవరణలోని వివిధ హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మూడు నెలలకు సంబంధించి ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా ఈశ్వరయ్య యాదవ్



యాదమరి(పూతలపట్టు): యాదమరి ఎస్‌ఐగా ఈశ్వరయ్య యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రామాంజనేయులను కలకడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయడంతో చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఈశ్వరయ్యను యాదమరికి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది ఆయన చెప్పారు.

అరగొండలో ఊరేగిన శ్రీకృష్ణుడు



రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

తవణంపల్లె: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని అరగొండలో రుక్మిణీ, సత్యభామ సమేతంగా శ్రీకృష్ణుడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అరగొండ కోదండరామాలయంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడికి అర్చకులు అభిషేకం, పూజార్చనలు చేసి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం పల్లకిలో కొలువుదీరిన రుక్మిణీ సత్యభామ సమేతంగా శ్రీకృష్ణుడు మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ ఊరేగారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



కామినాయనపల్లెలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి వరలక్ష్మి కోరారు. మండలంలోని కామినాయనపల్లెలో పంటలకు చేస్తున్న ఈ–క్రాప్ నమోదును బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు పంటలను ఈ–క్రాప్ నమోదు చేసుకోవడం వలన పంటల బీమా, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు పొందవచ్చన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ–క్రాప్ నమోదును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటల సాగులో అధికంగా రసాయనిక ఎరువులు వాడరాదని సూచించారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం



వర్షం వచ్చినప్పుడు ఇరువారం బైపాస్ వద్ద పరిస్థితి

- చిత్తూరు- పరదరామి రోడ్డు అధ్వానం
- రోడ్లపై అడుగుకో గుంత
- ప్రజలకు ప్రత్యక్ష నరకం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పూతలపట్టు నియోజకవర్గంలోని పలు రోడ్లు ఇటీవల వర్షాలకు గుంతలమయమై అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో చిన్నపాటి గుంతలను కూడా భూతద్దంలో చూపుతూ ప్రజల దృష్టిలో పడేందుకు నానా హడావుడి చేసిన టీడీపీ తీరా అధికారంలోకి వచ్చాక రోడ్లకు తట్టెడు మట్టి కూడా వేసి మరమ్మతులు చేసిన పాపాన పోలేదని ప్రజలు మండిపడుతున్నారు. చెప్పేది శ్రీరంగనీతులు..దూరేది దొమ్మరి గుడిసెలు అన్న చందాన కూటమి ప్రభుత్వం తీరు ఉంటోందని నిరసిస్తున్నారు.

పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలంలోని ఇరువారం చెక్‌పోస్టు నుంచి కనికాపురం చెక్‌పోస్టు వరకు సుమారు 23 కిలోమీటర్లు రహదారిలో అడుగుకో గుంత ఉంటోంది. జోడి చింతల చెక్‌పోస్టు నుంచి కనికాపురం చెక్‌పోస్టుకు 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి 45 నిమిషాలు పడుతుండటం చూస్తే రోడ్డు గుంతలమయమై ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ మార్గంలోనే సామాన్య ప్రజలతో పాటు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ప్రయాణిస్తుంటారు ఆ మార్గం కనికాపురం మీదుగా గుడియాత్తం(తమిళనాడు)కు వెళ్తుంది. ఒక్కప్పుడు ఆ చివరి నుంచి ఈ చివరి వరకు ప్రయాణం చేయాలంటే 30 నిమిషాలు పట్టేది. ఇప్పుడు జోడి చింతల నుంచే 45 నిమిషాలు పడుతోంది. రాత్రిపూట ఏది చిన్న గుంతో, ఏది పెద్ద గుంతో తెలియక వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రజలకు ప్రత్యక్ష నరకం

గతంలో రోడ్లంటే ఇలా ఉండాలని తమిళనాడుకు వెళ్లే రహదారులను నమూనాగా చూపేవారు. పొరుగు రాష్ట్రం వారు కనికాపురం మీదుగా గుడియాత్తం, వేలూరును తక్కువ సమయంలోనే వెళ్లేవారు. యాదమరి, జోడిచింతలు, కాశిరాళ్ల గ్రామస్తులు చిత్తూరు మీదుగా వేలూరుకు వెళ్లే బదులు గుడియాత్తం మీదుగా తక్కువ సమయం అనే ఉద్దేశంతో సులువుగా ప్రయాణించేవాళ్లు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇప్పుడా మార్గం గుంతలు తేలి, వర్షపు నీరు నిలిచి, వాహనాదారులు ఫీట్లు చేయాల్సి వస్తోంది.. జోడిచింతల–కనికాపురం రహదారిలో సుమారుగా 50 గ్రామాలున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అక్కడ నుంచి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురావడానికి గంట సమయం పడుతోంది.

పట్టించుకోని పాలకులు–అధికారులు

మండల ప్రజలు రోడ్డు మరమ్మతుల విషయమై అధికారులకు, రాజకీయ నాయకులకు నివేదించినా ఫలితం శూన్యం. రోడ్ల విషయంలో నేతలు ఇచ్చిన ఎన్నికల హామీలు ఎప్పుడు కార్యరూపం దాల్చుతాయోనని ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యే మురళీ మోహన్ కనికాపురం రోడ్డు విషయమై ఆర్‌అండ్‌బీ మంత్రికి ప్రతిపాదన పెట్టామని, త్వరలోనే రోడ్డు మరమ్మతులు చేయిస్తామని ప్రకటించారు.

ఎప్పుడూ ప్రమాదాలే..!

చిత్తూరు– కనికాపురం రహదారి గుంతలమయం కావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాశిరాళ్లకు చెందిన రామచంద్ర పిళ్లై మార్చిలో పట్టణం నుంచి ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అలాగే బంగారుపాళ్యం మండలం బొంబాయిపల్లెకు చెందిన చిట్టెమ్మ అదే నెలలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఇక, మండలంలోని కోణాపల్లెకు చెందిన సంపత్(36), గత సంవత్సరం ఆగస్టులో, అలాగే గుట్ట కిందవూరుకు చెందిన భరత్‌కుమార్(22) రోడ్డు ప్రమాదాని గురై మృతిచెందారు. ఇవి రికార్డు అయిన కేసులు మాత్రమే. ఇక తెలియని ప్రమాదాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కల్పించాలని యాదమరి మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డులో వెళ్లాలంటే భయమేస్తుంది.



కనికాపురం రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయమేస్తుంది. ఎక్కడ చూసినా గుంతలుండడంతో చాలా కష్టంగా ఉంది. ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రులకు ఈ రూట్లో వెళ్లాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో కుదరదు. వర్షాకాలంలో మరీ ఘోరంగా ఉంటుంది. తరచూ తమిళనాడుకు లారీలు వెళ్తుండడంతో ఆ రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది.

– కె.బాలరాజు, యాదమరి మండలం

రోడ్డు మరమ్మతులు చేయరూ!



కాశిరాళ్ల నుంచి రోడ్డు పరిస్థితి ఘోరంగా ఉంది. కాలేజీ, పనులకు వెళ్లాలంటే ఎక్కువ సమయం పడుతోంది. వర్షాకాలంలో ఇక చెప్పనక్కర్లేదు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుకుంటున్నాం.

– మహేష్, పెరుమాళ్లపెంట, యాదమరి



జోడిచింతల వద్ద రోడ్డు మధ్యలో గుంతలు



మార్లబండ వద్ద ఇబ్బందిగా ప్రయాణిస్తున్న ప్రయాణికులు



కనికాపురం వద్ద ప్రయాణికుల పరిస్థితి



రోడ్డు మధ్యలో గుంత

నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండలంలోని సంతగేటు వద్ద నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, కలెక్టర్ సుమీత్‌కుమార్ గాంధీ, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ, మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నూతన ఆరోగ్య కేంద్రాన్ని రూ.1.46 కోట్లతో నిర్మించారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, యాదమరి మండలంలో రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రస్తుతం చాలా మంది రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్నారని, వీటికి సంబంధించి మందులు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఆయా సమస్యలతో బాధపడుతున్న వారు మందులు వారి వద్ద పొందవచ్చన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన పీహెచ్‌సీ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమా మహేశ్వర్‌రెడ్డి, అదనపు డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ పార్థసారథి, వివిధ శాఖల అధికారులు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం.. ఏకగ్రీవం





మొగిలప్పనాయుడు, హరిప్రసాద్

తవణంపల్లె: నోబెల్ టీచర్స్ అసోసియేషన్ తవణంపల్లె మండల శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా మొగిలప్పనాయుడు, ఉపాధ్యక్షులుగా జయశ్రీ, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్, కోశాధికారిగా వెంకటేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా సరళ, ఈశ్వర్‌శెట్టి, సభ్యులుగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా నిరంజన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నేతలు మునస్వామి, జయప్రకాష్ నాయుడు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేష్ పర్యవేక్షణలో సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన జేసీకి అధికారుల శుభాకాంక్షలు





జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఓ నేతలు, జేసీకి మొక్కను అందజేస్తున్న మెప్మా పీడీ

చిత్తూరు కలెక్టరేట్: జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విద్యాధరిని పలు శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలెక్టరేట్‌లో బుధవారం పలువురు అధికారులు కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ రాధమ్మ, ఏపీ వీఆర్‌ఓ అసోషియేషన్ రాష్ట్ర నేతలు బాలాజీరెడ్డి, జిల్లా నేతలు పద్మనాభం, హనుమంతు, తహసీల్దార్‌లు శేషగిరి, హుస్సేన్, ఎల్డీఎం హరీష్, జేసీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని 197రామాపురం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణీలు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. వైద్యసిబ్బంది సరస్వతి, దివ్య, శశి, శివగామి పాల్గొన్నారు.

పాలేరులో శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు ఎస్టీ కాలనీలో బుధవారం శ్రీకృష్ణుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగాంగా ఉదయం గ్రామానికి చెందిన ప్రబోధానంద భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కృష్ణుడి ప్రతిమను విశేషంగా అలంకరించి, పల్లకిపై కొలువుదీర్చి, గ్రామ వీధుల్లో మేళతాళాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనల నడుమ కోలాహలంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎటుచూసినా నిర్లక్ష్యమే!







చిత్తూరు కొంగారెడ్డిపల్లె గుడి, బడి వద్ద స్తంభానికి అల్లుకున్న కేబుల్స్, ఐరాలలో లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన తీగలు, దాసరపల్లె వద్ద ఒరుగుతున్న స్తంభం

- ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా?
- జాగ్రత్తలు తీసుకోని విద్యుత్ సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ప్రమాదాలు జిల్లాలో పెరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా వాటిపై సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. లైన్‌మన్లు పలు ప్రాంతాల్లో ఫీల్డ్‌కు వెళ్లి సమస్యలను పట్టించుకోవడం మానేశారనే విమర్శ ఉంది. ఫిర్యాదులు వచ్చి, పేపర్‌లో సమస్యలపై వార్తలు వస్తే తప్ప స్పందించడం కష్టంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరిదో తప్పుతో ప్రమాదంలో నిండు ప్రాణం బలికావడం కుటుంబం రోడ్డు పైకి రావడం జరుగుతోంది. మానవతా దృక్పథంతో వీటిపై ఆలోచన చేయాల్సి ఉంది.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- ఆగస్టు 17 శనివారం పుంగనూరు పట్టణం కొత్తపేటలో దౌలత్ (14) తన ఇంటిపైన పావురాలను పట్టుకునే ప్రయత్నంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు.
- ఆగస్టు 21న కడప బెల్లం మండీ వీధిలో పాఠశాల నుంచి కేబుల్ తగిలి రహమాన్(14) మృతిచెందాడు.
- ఆగస్టు 26న చిత్తూరులోని శంకరయ్యగుంటలో మొదటి అంతస్తు నుంచి ఇనుపపైప్‌ను కిందకు దించుతున్న క్రమంలో మేస్త్రీ రమేష్ 33 కేవీ లైన్ తగిలి ప్రమాదానికి గురయ్యాడు. ఈ సంఘటనలో అతని చేతులు కాలాయి.
- ఆగస్టు 27 బంగారుపాళ్యం మండలం కామాక్షిపురానికి చెందిన గణపతి(40) ఇందిరమ్మకాలనీలో పెయింట్‌పనులు చేస్తుండగా లైన్‌కున్న కేబుల్ వైర్ తగిలి మృతిచెందాడు.

గత 10 రోజుల్లో జిల్లాలో జరిగిన మూడు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. అప్రమత్తంగా లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కేబుల్ వైర్ నుంచి కరెంట్ పాస్ కాదని భ్రమలో కొందరు ఉన్నారు. చిత్తూరు, అర్బన్, రూరల్ డివిజన్ పరిధిలో ఎక్కువగా ఎత్తు తక్కువలో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లు, గుడులు, బడులు, ప్రార్థన మందిరాలు వద్ద కరెంటు స్తంభాన్ని చుట్టేసుకున్న కేబుల్స్ దర్శనమిస్తాయి. దీనికి తోడు పలు ప్రాంతాల్లో వాలిన స్తంభాలు, మొదటి అంతస్తులో చేతికందే విధంగా లైన్ ఉండడం, ట్రాన్స్‌ఫార్మర్లకు పొలాలు, బహిరంగ స్థలాల వద్ద అల్లుకున్న తీగలు ప్రమాదకరంగా మారాయి. రోజూ అటువైపు వెళ్తున్నా వాటిని చూడడం విద్యుత్ సిబ్బంది మానేశారు.

సర్వే చేస్తున్నాం



ఉమ్మడి జిల్లాలో ఎత్తు తక్కువగా ఉండే ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలకు అల్లుకున్న డిష్ కేబుల్స్, ప్రమాదకరంగా ఉన్న స్తంభాల మీద సిబ్బందిని సర్వే చేయమన్నాం. నివేదిక వచ్చాక తగిన చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, ఎటువంటి విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా ఉంటే మంచిది.

–సురేంద్రనాయుడు, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు విన్నవించారు. స్థానిక గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రంతాల్లో నుంచి తమ సమస్యలను బాధితులు తెలిపారు. మొత్తం 5 సమస్యలు రాగా అందులో 1 సమస్యను పరిష్కారించామని ఈఈ మునిచంద్ర పేర్కొన్నారు. రివిజన్ ఆఫ్ బిల్ 3, లైన్ మార్పు 1, కేబుల్ మార్పు 1 వచ్చిందన్నారు. ఇందులో 1 రివిజన్ ఆఫ్ బిల్లు సమస్యను పరిష్కారించామన్నారు. కార్యక్రమంలో డీఈలు పద్మనాభపిళ్లై శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు కేశవచంద్ర, మాధురి పాల్గొన్నారు.

మాతమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

తవణంపల్లె: దిగువమోదలపల్లె కాలనీలో బుధవారం నూతన మాతమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ చేశారు. మోహన్‌నాయుడు ఆర్థిక సాయంతో ఈ గుడిని నిర్మించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భూమిపూజల కార్యక్రమంలో అర్చకులు ఐదుగురు మహిళలతో అభిషేకం, శంకుస్థాపన చేయించారు.

మిట్టపల్లెలో వేంకటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి..

మండలంలోని మిట్టపల్లెలో బుధవారం వేంకటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి గ్రామస్తులు భూమి పూజ చేయించారు. ముఖ్యఅతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయం చేస్తామన్నారు.